## క్లుప్తంగా

### శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించాలి



**బాల్కొండ:** రైతులకు పంటల సాగుపై సూచనలు, సలహాలు ఇవ్వడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'రైతు ముంగిట శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి అన్నారు. సోమవారం బాల్కొండ మండలం వన్నెల్(బి)లో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వచ్చే ఖరీఫ్‌లో రైతులు సాగు చేయాల్సిన పంటల గురించి శాస్త్రవేత్తల సూచనలను పాటించాలన్నారు. జీలుగ విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. శాస్త్రవేత్తలు కృష్ణ చైతన్య, వినాయక్, రోహిత్‌రెడ్డి, వ్యవసాయ అధికారి బద్దం లావణ్య, రైతులు పాల్గొన్నారు.

### అనుమతిలేని మదర్సాను మూసివేయాలి



**వేల్పూర్:** వేల్పూర్‌లో ఎలాంటి అనుమతి లేకుండా నడుపుతున్న మదర్సాను మూసివేయాలని స్థానిక బజరంగ్‌దళ్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. వేల్పూర్‌లో ఉన్న మదర్సాకు ఎంఈవో నుంచి గాని, డీఈవో నుంచి గాని ఎలాంటి అనుమతి లేదని పేర్కొన్నారు. అనుమతి ఉంటే సమాచార హక్కు చట్టం ద్వారా తెలపాలని డిమాండ్ చేశారు. బజరంగ్‌దళ్ యూత్ అధ్యక్షుడు సుధాకర్, కమలేష్, యువజన సంఘాల నాయకులు నర్సారెడ్డి, అన్వేష్, శ్రీకాంత్, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ నూతన కార్యవర్గం ఎన్నిక

**కమ్మర్‌పల్లి:** కమ్మర్‌పల్లి మండల బీజేపీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు మండలాధ్యక్షుడు బద్దం రమేష్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఉపాధ్యక్షులుగా సతీష్ (హసకొత్తూర్), వెంకట్‌రెడ్డి(చౌట్‌పల్లి), వర్షం సంజన రాజేష్(అమీర్‌నగర్), లక్ష్మీ గంగాధర్(నర్సాపూర్), ప్రధాన కార్యదర్శులుగా సోమ నరేష్(ఉప్లూర్), సున్నం మోహన్(కమ్మర్‌పల్లి), కార్యదర్శులుగా ఆల్గోట్ బలరాం, ప్రశాంత్, రవి, భాస్కర్, కార్యవర్గ సభ్యులుగా బద్దం స్వప్న, ఉట్నూర్ శివకుమార్, పసుపుల చంద్రమోహన్, శ్రీరాముల శ్రవణ్, సంతోష్, సక్కరం నర్సయ్య, వంశీ, లక్మ రాజేష్, గణేష్, బానోత్, ప్రశాంత్‌లను ఎన్నుకున్నారు.

### ఘనంగా నర్సింగ్ డే



**ఆర్మూర్‌టౌన్:** పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో సోమవారం ఇంటర్నేషనల్ నర్సింగ్ డే సందర్భంగా నర్సింగ్ సిబ్బందిని ఆర్మూర్ కాంపౌండర్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవికుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఆస్పత్రిలో నర్సులే కీలక బాధ్యత వహిస్తారన్నారు. నర్సులు చేస్తున్న సేవలను కొనియాడారు. వైద్యులు అమృత్‌రాంరెడ్డి, కాంపౌండర్ అసోసియేషన్ అధ్యక్షులు గణేష్, రాకేష్, మహమ్మద్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

### క్రీడాకారిణికి అభినందనలు



**మాక్లూర్ :** అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి దుద్దు కీర్తనను సోమవారం ఆర్మూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత ఆశన్నగారి రాజేశ్వర్ రెడ్డి.. ఆమె స్వగ్రామమైన మాక్లూర్ మండలం ఒడ్డేటిపల్లి గ్రామానికి వెళ్లి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పోటీలలో పాల్గొని నిజామాబాద్ జిల్లాకు పేరు ప్రతిష్టలు తెచ్చి పెట్టాలన్నారు. అనంతరం శాలువాతో సన్మానించి, కీర్తనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తల్లిదండ్రులైన దుద్దు గంగాధర్, దుద్దు సవితలకు రాజేశ్వర్ రెడ్డి సూచించారు. నాయకులు ఆకుల రజనీష్, మాస్త ప్రభాకర్ ఉన్నారు.

### సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ

**కమ్మర్‌పల్లి:** నర్సాపూర్‌లో రూ. 8 లక్షల నిధులతో చేపట్టే సీసీ రోడ్ల నిర్మాణానికి ఏఎంసీ చైర్మన్ నర్సయ్య సోమవారం భూమిపూజ చేశారు. టీపీసీసీ అధికార ప్రతినిధి బి. వేణుగోపాల్ యాదవ్, నాయకులు పడిగెల ప్రవీణ్‌రెడ్డి, సంజీవ్ యాదవ్, రమేష్‌గౌడ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్థలం లభించేనా..?

- ముప్కాల్‌లో పీహెచ్‌సీ భవన నిర్మాణం విషయంలో కొలిక్కి రాని స్థల సమస్య
- ఇరిగేషన్ స్థలం కోసం ప్రభుత్వానికి లేఖ
- మరో చోట స్థలం చూపించిన గ్రామస్తులు
- ఆ స్థలం సరిపోదంటూ తేల్చి చెప్పిన వైద్య శాఖాధికారులు



పీహెచ్‌సీ భవనం కోసం చదును చేస్తున్న స్థలం

**బాల్కొండ:** ముప్కాల్ మండల కేంద్రంలో పీహెచ్‌సీ భవన నిర్మాణానికి కావల్సిన స్థలం కొలిక్కి రావడం లేదు. రెండేళ్లుగా స్థలం లేక నిర్మాణ పనులు ప్రారంభం కావడం లేదు. ఏడాది కాలంగా స్థలం కోసం వెతుకుతూనే ఉన్నారు. గతంలో నిజాంసాగర్ కాలువ పక్కన గల ఇరిగేషన్ స్థలం కోసం పరిశీలన చేసి ప్రభుత్వానికి లేఖ రాశారు. కాని ఇప్పటికీ ఎలాంటి కదలిక లేదు. దీంతో తాజాగా ప్రస్తుతం పోలీస్ స్టేషన్ నిర్వహిస్తున్న వెనుక భాగం వైపు మరో స్థలాన్ని పంచాయతీ రాజ్ శాఖాధికారులకు అప్పగించారు. ఆ స్థలం చదును కూడా చేశారు. కానీ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం నిర్మించటానికి 2 ఎకరాల స్థలం ఉండాలని నిబంధనలున్నాయి. కాని చదును చేసిన స్థలం కేవలం 21 గుంటలు మాత్రమే ఉంది. అందులో నాలుగు గుంటలు రోడ్డుకు పోతుంది. దీంతో మిగిలేది 17 గుంటలు మాత్రమే. దీంతో వైద్య శాఖాధికారులు ఆ స్థలం సరిపోదని, అందులో నిర్మించడం కుదరని తేల్చి చెప్పారు. దీంతో స్థలం సమస్య మొదటికి కొచ్చింది. గత ప్రభుత్వ హయాంలోనే పీహెచ్‌సీ భవనం కోసం రూ.1.43 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ముప్కాల్ మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు అనేకం కబ్జాల పాలయ్యాయంటూ స్థానికులే జిల్లా ఉన్నత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. కాని ఇక్కడ ప్రభుత్వ భవనం నిర్మించటానికి స్థలం మాత్రం లభించడం లేదు. పాలకులు, ఉన్నత అధికారులు స్పందించి వెంటనే స్థలం కేటాయించి పీహెచ్‌సీ భవనాన్ని నిర్మించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**రెండెకరాలు కావాలి**

మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం నిర్మించాలంటే నిబంధనల ప్రకారం రెండు ఎకరాల స్థలం కావాలి. కనీసం ఎకరన్నర స్థలం ఉండాలని సూచించాం. పీఆర్ అధికారులకు అప్పగించిన స్థలంలో నిర్మించడం కుదరదని తేల్చి చెప్పాం. – రమేశ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఆర్మూర్

## సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రైతు సంఘం నేత దేవారం, పాల్గొన్న నాయకులు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆశాలు

**ఆర్మూర్:** దేశవ్యాప్తంగా మే 20న జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవారం పిలుపునిచ్చారు. ఆర్మూర్ పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో సోమవారం ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా నిజామాబాద్ రూరల్, కామారెడ్డి సంయుక్త జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11 సంవత్సరాల బీజేపీ పాలనలో కార్మికుల జీవన ప్రమాణాలు తీవ్రంగా పడిపోయాయని, వేతనాలు పెరగలేదని, ఉద్యోగ భద్రత లేదన్నారు. కార్మికుల హక్కులను హరించే విధంగా కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాన్నారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు ఎస్.సురేష్, ఆర్.రమేష్, వి. సత్తెమ్మ, కె. రాజేశ్వర్, జి.అరవింద్, బి.కిషన్, యు.రాజన్న తదితరులు పాల్గొన్నారు.

**సమ్మె పోస్టర్ల ఆవిష్కరణ**

**రుద్రూర్:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, కార్మిక చట్టాలను బలోపేతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు నన్నేసాబ్ డిమాండ్ చేశారు. ఈనెల 20న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్లను సోమవారం రుద్రూర్ మండల కేంద్రంలో ఆశ, అంగన్‌వాడి కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. నాయకురాలు గంగామణి, భూలక్ష్మి, వాణి, లత, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

**సమ్మె నోటీసు అందజేత**

**వర్ని:** సార్వత్రిక సమ్మెలో తాము పాల్గొంటామని గ్రామపంచాయతీ కార్మికులు వర్ని ఎంపీడీవో మారుతికి సమ్మె నోటీసులు సోమవారం అందజేశారు. సీఐటీయూ నాయకులు నన్నేసాబ్, జీపీ కార్మిక సంఘం వర్ని మండల అధ్యక్షుడు సాయిలు, లింగం, సాయిచరణ్, పీరయ్య, అనిల్, రాములు పాల్గొన్నారు.



సమ్మె నోటీసు అందజేస్తున్న జీపీ కార్మికులు

## సైబర్ నేరాలపై అవగాహన



సాటాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఎస్సై చంద్ర మోహన్

**రెంజల్(బోధన్):** ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ క్రైంపై రెంజల్ ఎస్సై చంద్రమోహన్ స్థానికులకు అవగాహన కల్పించారు. సోమవారం సాటాపూర్‌లో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. అనంతరం స్థానికులతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. చిన్న పిల్లలకు వాహనాలను ఇవ్వవద్దని, ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ కలిగి ఉండాలని, వాహన ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. గుర్తు తెలియని నంబర్ల నుంచి మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్ వస్తే స్పందించవద్దని సూచించారు. హెడ్‌కానిస్టేబుళ్లు శంకర్, సునీత, పీసీలు ఒడ్డెన్న, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



సర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో

**వర్ని/రుద్రూర్:** అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. సోమవారం వర్ని మండలం పొట్టిగుట్టలో, పొతంగల్ మండలంలోని కల్లూర్, జల్లాపల్లిలలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇళ్ల సర్వేను అధికారులు పకడ్బందీగా చేపట్టాలని, తప్పులకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అక్రమాలు జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్ని ఎంపీడీవో మారుతి, వెరిఫికేషన్ అధికారి సతీష్, పంచాయతీ కార్యదర్శులు శ్రీకాంత్, ముస్తాక్ హుస్సేన్లు పాల్గొన్నారు.

## పశువులకు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న మండల పశువైద్యాధికారి

**మాక్లూర్:** అడవిమామిడిపల్లిలో సోమవారం మండల పశువైద్యాధికారులు ఉమా సాహెర్, కిరణ్ దేశ్‌పాండే ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. గ్రామాల వారీగా నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు, పశువు పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని కిరణ్ దేశ్‌పాండే, ఉమా సాహెర్ లు సూచించారు. సిబ్బంది టి.వినీత, సుధీర్, అహ్మద్ పాషా, పుష్ప, ఆర్.కళ్యాణి, గంగాధర్, మహేశ్వరి, లక్ష్మి పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



కళా బృందం ప్రదర్శనలు తిలకిస్తున్న గ్రామస్తులు



రాయకూర్‌లో మాట్లాడుతున్న ఎస్సై సాయన్న

**రుద్రూర్:** రాయకూర్‌లో సోమవారం రాత్రి పోలీస్ కళా బృందం ఇచ్చిన ప్రదర్శనలు విశేష స్పందన లభించింది. నాటికలు, పాటల రూపంలో నేరాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలు జీవితాన్ని నాశనం చేస్తాయని వివరించారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఎస్సై సాయన్న, హెడ్ కానిస్టేబుల్ అంజద్, కళా బృందం సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం



**నందిపేట్(ఆర్మూర్):** మండల కేంద్రంలోని రామ్‌నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న రామాలయంలో ఈ నెల 14 నుంచి 16 వరకు జరిగే సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు హాజరుకావాలని సోమవారం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో పాటు అదనపు కలెక్టర్‌కు రామాలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. శ్రీ కేదారీశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన జరుగనుంది. ఆలయ కమిటీ సభ్యులు రమణారెడ్డి, పెయింటర్ రాజు, కండక్టర్ నారాయణ, తదితరులున్నారు.

## ఆధ్యాత్మికం

■ **వీర బ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం**



**బాల్కొండ:** ముప్కాల్ మండలం రెంజర్లలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం వీరబ్రహ్మేంద్ర, గోవిందాంబల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. అలాగే బాల్కొండ మండల కేంద్రంలో దాస్ హనుమాన్ మందిరంలో సోమవారం బుద్ధ హనుమాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

■ **ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు ఏర్పాట్లు**



**డొంకేశ్వర్(ఆర్మూర్):** నికాల్‌పూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయం, విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఈ నెల 14 నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహించే వేడుకలకు ఆలయ కమిటీ, వీడీసీ సభ్యులు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయానికి రంగులేసి ముస్తాబు చేస్తున్నారు. నిత్యం యజ్ఞ హోమాలు, పూజలు ఉంటాయని.. చివరి రోజు ప్రాణప్రతిష్ఠ, పూర్ణాహుతి, అభిషేకం, కల్యాణం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. అన్నదానం కూడా ఉంటుందని తెలిపారు.

■ **సిద్ధులగుట్టపై ప్రత్యేక పూజలు**



**ఆర్మూర్‌టౌన్:** పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల ఆలయాల్లో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలకు నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో పల్లకి సేవ నిర్వహించారు. టీపీసీసీ అధికార ప్రతినిధి ఏబీ చిన్నా, బి. సుమన్, పీసీ గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, కొంతం మురళి, భజన మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

■ **ఆలయ వార్షికోత్సవాలు**

**పెర్కిట్(ఆర్మూర్):** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర ఆలయ 32వ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు ఆలయ వార్షికోత్సవాల్లో పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ రెడ్డి ఆలయ అభివృద్ధికి ఎస్‌డీఎఫ్ ద్వారా రూ.5 లక్షలు మంజూరు చేయించారు. కాంగ్రెస్ నాయకులు నిధుల ప్రొసీడింగ్ కాపీని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. నాయకులు మారుతీరెడ్డి, భూపేందర్, చిట్టి రెడ్డి, పురుషోత్తం, కిరణ్, గిరి, గడ్డం సంజీవ్ రెడ్డి, గడ్డం శ్యాం సుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



■ **సైనికుల యోగ క్షేమాల కోసం పూజలు**



**ఆర్మూర్‌టౌన్:** భారత దేశ సైనికుల యోగక్షేమం కోసం.. 'నేను సైతం– దేశం కోసం' కార్యక్రమంలో భాగంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్ ఆధ్వర్యంలో పట్టణంలోని నాగలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కలిగోట గంగాధర్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ మరింత శక్తివంతం కావాలని, దేశం శాంతి మార్గంలో ముందుకు సాగాలని ప్రార్థనలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ ప్రతినిధులు అంబికా రమేష్, రాజయ్య, అజయ్, నారాయణ, సడక్ మోహన్, భక్తులు పాల్గొన్నారు.

## గడ్డివాము దగ్ధం

**రుద్రూర్:** కోటగిరి మండలం సుద్దులంలో ఆదివారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించి గడ్డివాము దగ్ధమైంది. పక్కనే ఉన్న పశువుల పాకకు మంటలు వ్యాపించడంతో స్థానికులు అప్రమత్తమై అందులో ఉన్న పశువులను వదిలివేశారు. దీంతో ప్రమాదం తప్పింది. ఫైరింజన్ వచ్చి మంటలు ఆర్పేయడంతో ఊపిరి పీల్చుకున్నారు.

## సాంగ్లీ వెళ్లిన కోటగిరి ఏఎంసీ పాలకవర్గం



వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న కోటగిరి ఏఎంసీ పాలకవర్గ సభ్యులు

**రుద్రూర్:** కోటగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు సోమవారం మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్ కమిటీని సందర్శించారు. అక్కడ వ్యవసాయ ఉత్పత్తుల క్రయ విక్రయాలు ఎలా చేస్తున్నారో పరిశీలించారు. సాంగ్లీ వెళ్లిన వారిలో మార్కెట్ కమిటీ చైర్మన్ గైక్వాడ్ హన్మంతు, వైస్ చైర్మన్ అనిల్ కులకర్ణి, ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాస్, డాటా ఎంట్రీ ఆపరేటర్ కె. సాయిలు, పాలకవర్గ సభ్యులున్నారు.

## సొసైటీల అభివృద్ధికి సహకరించాలి



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



ప్రతిభ చూపిన విద్యార్థులను సన్మానిస్తూ..

- ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి

**బోధన్:** రైతుల అభ్యున్నతే లక్ష్యంగా సేవలందిస్తున్న సొసైటీల అభివృద్ధి, బలోపేతానికి సహకరించాలని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి సూచించారు. సోమవారం సాలూర మండలంలోని హున్సా సొసైటీ నూతన కార్యాలయ భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే, సొసైటీ పాలకవర్గ సభ్యులతో కలిసి భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా గ్రామ రైతు వేదిక భవన మరమ్మతులు, ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సొసైటీ చైర్మన్ మందర్న రవి, వైస్ చైర్మన్ వినోద్‌బాబా, డైరెక్టర్లు.. ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. అనంతరం బోధన్ పట్టణంలోని గ్రంథాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐదు కంప్యూటర్లను ప్రారంభించారు. స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిని సందర్శించి వైద్య సేవల తీరు సమీక్షించారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. సాలూర జెడ్పీహెచ్ఎస్‌లో ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన వివిధ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఎమ్మెల్యే సన్మానించారు. తహసీల్దార్ శశిభూషణ్, ఎంఈవో రాజీ మంజూష, సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, మాజీ ఉపసర్పంచ్ సరిదే సాయిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వీర జవాన్‌కు ఘన నివాళులు

**ఆర్మూర్‌టౌన్:** పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆర్మూర్ బంజారా నాయకుల ఆధ్వర్యంలో భారత్–పాకిస్తాన్ మధ్య జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన బంజారా ముద్దుబిడ్డ ఎం. మురళి నాయక్‌కు ఘన నివాళులు అర్పించారు. దీనికి ముందు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. నివాళులర్పించి రెండు నిమిషాల మౌనం పాటించి ఆయన ఆత్మశాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం బంజారా నాయకులు మాట్లాడుతూ.. మురళి నాయక్ దేశ రక్షణ కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసిన తీరు, బంజారా సమాజం ధైర్యాన్ని, దేశభక్తిని ప్రతిబింబిస్తోందన్నారు. మురళి కుటుంబసభ్యులకు అండగా నిలవాలని, వారి త్యాగాన్ని చిరస్థాయిగా గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. నేతలు రాజు నాయక్, పీర్‌సింగ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఆర్మూర్ బంజారా నాయకులు

## పథకాలు అర్హులకు అందేలా చూడాలి



సమావేశమైన కాంగ్రెస్ ముఖ్య నాయకులు

**నందిపేట్(ఆర్మూర్):** రాష్ట్ర ప్రభుత్వ పథకాలు పేదలకు అందేలా చూడాలని నందిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్ అన్నారు. సోమవారం నందిపేటలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంద మహిపాల్ మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాస్ పథకం అర్హులకు వచ్చేలా కృషి చేయాలని కోరారు. అర్హుల జాబితా తయారు చేసి మండల అధికారులకు అందజేయాలని ఇందిరమ్మ కమిటీ సభ్యులను కోరారు. నేతలు దమ్మాయి శ్రీను, ఇసుబ్, జమీల్, తదితరులు పాల్గొన్నారు.

**సినిమా**

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

| | |
|---|---|
| స్క్రీన్-1 | రైడ్-2(హిందీ)-10.00, 1.00, 7.25, 10.25, రెట్రో-4.00 |
| స్క్రీన్-2 | హిట్-12.30, 3.45, 7.00, 10.15 |
| స్క్రీన్-3 | రెట్రో-11.30, 2.55, 6.20, 9.45 |
| స్క్రీన్-4 | హిట్-11.30, 2.45, 6.00, 9.15 |

**మాంసం ధరలు (రూ..)**

| | | | |
|---|---|---|---|
| చికెన్ | ధరలు (కిలోకు) | డ్రెస్డ్ | 190 |
| | | లైవ్ | 160 |
| స్కిన్‌లెస్ | 220 | మటన్ | 800 |

**బంగారం ధరలు (10గ్రాములు)**

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్ | 97,000 | వెండి(కిలో) | 1,01,000 |
| 22 క్యారెట్స్ | 89,540 | | |

– నిజామాబాద్ బిజినెస్